ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించిన డిఆర్వో శ్రీనివాసమూర్తి

విశాలాంధ్ర-విజయనగరం : ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ-2025 లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి ఆదివారం పరిశీలించారు. వివిధ పోలింగ్ కేంద్రాల పరిధిలో ఈనెల 9, 10 తేదీల్లో చేపట్టిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. దీనిలో భాగంగా స్థానిక కణపాక పాఠశాలలోనే 25, 26, 27 పోలింగ్ కేంద్రాలను డిఆర్ఓ సందర్శించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా, ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల గురించి బీఎల్వోలను ఆరా తీశారు. సవరణ ప్రక్రియ గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించాలని, అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని ఈ సందర్భంగా బిఎల్వోలను డిఆర్ఓ ఆదేశించారు. ఈ నెల 23,24 తేదీల్లో కూడా స్పెషల్ క్యాంపైయిన్ నిర్వహిస్తామని తెలిపారు. ఎన్నికల డిప్యూటీ తాసిల్దార్ సంజీవి కూడా పాల్గొన్నారు.

కిడ్నాప్ అయిన పసివాడ్ని తల్లి చెంతకు చేర్చిన పోలీసులు

ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: పట్టణంలో కిడ్నాప్ అయిన 8 మాసాల పసిబిడ్డ ఆచూకీ కనిపెట్టి, గంటల వ్యవధిలోనే కేసు మిస్టరీని ఛేధించి, బిడ్డను తల్లి చెంతకు విజయనగరం వన్ టౌన్ పోలీసులు చేర్చారని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. వివరాల్లోకి వెళ్ళితే.. ఒడిస్సా రాష్ట్రం రాయఘడకు చెందిన అశా సాహు తన భర్త, పసి బిడ్డతో కలిసి కూలి పనుల నిమిత్తం విజయనగరం పట్టణం వచ్చి, ఎత్తు బ్రిడ్జి సమీపంలో ఉంటున్నట్లు, నవంబరు 8న మధ్యాహ్నం 2 నుండి 3 గంటల సమయంలో నిద్రపోయిన సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి, తన ప్రక్కనున్న అభిన సాహు (8 మాసాలు) ను కిడ్నాప్ చేసి తీసుకొని పోయినట్లుగా విశ్వకాంచన అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో విజయనగరం వన్ టౌన్ పోలీసు స్టేషనుకు నవంబరు 9నఫిర్యాదు చేసారన్నారు. ఈ ఫిర్యాదుపై విజయనగరం వన్ టౌన్ పోలీసు స్టేషను ఎస్ఐ ఎ.నరేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.ఈ కేసును తీవ్రమైన చర్యగా భావించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ బాలుడి కిడ్నాప్ కేసును ఛేధించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, గాలింపు చర్యలు చేపట్టారు. ఈ కేసులో సాంకేతికతను వినియోగించి, బాలుడ్ని ఒక మహిళ కిడ్నాప్ చేసినట్లుగా ప్రాథమికంగా గుర్తించాయి. నిందితురాలి ఆచూకీ కనిపెట్టేందుకు విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, వన్ టౌన్ ఇన్చార్జ్ సిఐ ఎల్.అప్పలనాయుడు ఆధ్వర్యంలో పోలీసు బృందాలు ఆర్టీసి కాంప్లెక్సు, రైల్వే స్టేషను, విజయనగరం పట్టణంలోని కొన్ని ముఖ్యమైన ప్రాంతాలను, పట్టణ శివార్లలోని ప్రాంతాల్లో ముమ్మర గాలింపులు, తనిఖీలు చేపట్టారు. చివరకు మూడు గంటల వ్యవధిలోనే బాలుడ్ని కిడ్నాప్ చేసిన నిందితురాలు దాసన్నపేట, నాగాశపు వీధికి చెందిన కోరాడ సుశీల(24)గా గుర్తించి, అరెస్టు చేసి, ఆమె వద్ద నుండి కిడ్నాప్ అయిన అభిన సాహు (8మాసాలు) ను స్వాధీనం చేసుకొన్నారని జిల్లా ఎస్పీ తెలిపారు. తల్లి ఆశా సాహుకు బాలుడ్ని విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు అప్పగిం చడంతో కిడ్నాప్ కేసు సుఖాంతం అయ్యిందని తెలిపారు. నిందితురాలి కోరాడ సుశీలను రిమాం దుకు తరలించామన్నారు. ఈ కిడ్నాప్ కేసును గంటల వ్యవధిలోనే ఛేధించేటట్లు పర్యవేక్షించిన విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, వన్‌టౌన్ ఇన్చార్జ్ సిఐ ఎల్.అప్పలనాయుడు, ఎస్ఐ ఎ.నరేష్, కానిస్టేబుళ్ళు జిన్నం శ్రీను, వెంకట రమణ, ధనలక్ష్మిలను ఎస్పీ వకుల్ జిందల్ అభినందించారు.

ఎన్నికలు జరిగేనా..?

- ఎమ్మెల్సీ ఎన్నికలపై అందరిలో ఉత్కంఠ
- రఘురాజుకు హైకోర్టు మద్దతు తీర్పుతో కలకలం
- ఇంకా తేల్చని ఎన్నికల కమీషన్

విశాలాంధ్ర-విజయనగరం : జిల్లాలో స్థానికసంస్థల శాసనమండలి సభ్యుని ఎన్నిక ప్రస్తుతం చర్చానీయాంశంగా మారింది. ఎమ్మెల్సీగా ఉన్న ఇందుకూరి రఘురాజును అనర్హత వేటు వేయడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించి తనకు అనుకూలంగా తీర్పును తెల్చుకున్నారు. అనర్హత వేటును న్యాయస్థానం రద్దు చేసినా శాసనమండలి చైర్మన్ మాత్రం ఈవిషయంలో ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఇదిలా వుండగా అనర్హత వేటు అనంతరం ఏర్పడిన ఖాళీకి కేంద్ర ఎన్నికల కమీషన్ నిభందనల మేరకు ఎన్నికల నోటిఫికేషన్‌ను ఈనెల 4వతేదీన విడుదల చేసింది. ప్రస్తుతం నామినేషన్ల స్వీకరణ చివరి దశలో ఉంది. ఈనపెల28న ఎన్నికల జరగనుంది. ఒకవైపు కోర్టు తీర్పు రావడం, మరోవైపు ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుండడంతో అధికారులు, నేతలు, ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. ఎన్నికల కమీషన్‌నుంచి ఎప్పుడు ఏఆదేశాలు వస్తాయోఅని ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు కేంద్రంనుంచి ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో రాష్ట్ర ఎన్నికల కమీషన్ ప్రకటన చేయలేదని తెలుస్తోంది.

నేనే ఎమ్మెల్సీని..

రేపోమాపో ఎన్నికల ప్రక్రియ ఆగిపోతుంది

ఇందుకూరి రఘురాజు

నన్ను అకారణంగా, అన్యాయంగా ఎమ్మెల్సీ పదవినుంచి తొలగించారు. ఇది పూర్తిగా అన్యాయం కనుక నేను న్యాయస్థానాన్ని ఆశ్రయించాను. ఇందులో ఎంతవరకు వాస్తవం ఉందో చిన్న పిల్లాడిని అడిగినా చెబుతాడు. నాకు న్యాయస్థానం అనుకూలంగా తీర్పు ఇచ్చింది. కోర్టు తీర్పు ప్రకారం నేనే ఎమ్మెల్సీని. దీంతో ఎన్నికల ప్రక్రియ నేడో రేపో ఆగిపోతుంది.

సీతం ఈ-వెస్ట్ సేకరణ డ్రైవ్ విజయవంతం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: సత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (సీతం) ఈ-వెస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాలను) సేకరణ డ్రైవ్ విజయవంతంగా ముగియడంతో పర్యావరణ స్థిరత్వానికి తమ ప్రతిబద్ధతను మరోసారి ధృవీకరించింది. సీతం విద్యార్థులు,సిబ్బంది కృషి కారణంగా, ఈ డ్రైవ్ ద్వారా 500 కిలోలకుపైగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలు సేకరించబడ్డాయి. ఈ కార్యక్రమం బాధ్యతాయుత ఈ-వెస్ట్ వదిలివేతను ప్రోత్సహించడం, తగ్గింపు, మళ్లీ వినియోగం మరియు రీసైక్లింగ్ ప్రాముఖ్యత గురించి కళాశాల సమాజంలో అవగాహన కల్పించడానికి లక్ష్యంగా పెట్టుకుంది. ఈ-వెస్ట్ సేకరణలో పాడైపోయిన కంప్యూటర్లు, మానిటర్లు, కీబోర్డులు, పవర్ బ్యాంక్‌లు, ఎలక్ట్రానిక్ ఓవెన్లు, మిక్సర్లు, గ్రైండర్లు, ఛార్జర్లు, యుపిఎస్ యూనిట్లు, సిసిటివి కెమెరాలు మరియు బ్యాటరీలు వంటి వివిధ ఎలక్ట్రానిక్ పరికరాలు ఉపకరణాలు ఉన్నాయి. సేకరించిన అన్ని వస్తువులను సుస్థిర వ్యర్థ నిర్వహణలో నిష్ణాతులైన సర్టిఫైడ్ ఈ-వెస్ట్ మేనేజ్‌మెంట్ కంపెనీ అయిన గ్రీన్ వెవ్స్ ఎన్విరాన్‌మెంటల్ సొల్యూషన్స్‌కి బాధ్యతగా అప్పగించారు. ఈ డ్రైవ్ సీతం పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించాలనే లక్ష్యానికి అనుగుణంగా ఉండి, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగ్గించడంలో మరియు శుభ్రమైన, పచ్చదనభరిత భవిష్యత్తును ప్రోత్సహించడంలో కళాశాల చురుకైన పాత్రను ప్రదర్శిస్తుంది. సక్రమంగా వదిలివేతకు మించి, ఈ డ్రైవ్ విద్యార్థులకు విద్యా వేదికగా కూడా ఉపయోగపడింది, ఈ-వెస్ట్ పర్యావరణంపై ప్రభావాన్ని మరియు విద్యార్థులు తమ రోజువారీ జీవితం లో సుస్థిర ఆచరణలను అనుసరించాలనే ప్రేరణను కల్పించింది.ఈ సందర్భంగా, సీతం డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశి భూషణ రావు మాట్లాడుతూ, ఈ-వెస్ట్ భద్రతా రీసైక్లింగ్ మరియు వదిలివేత కోసం సీతం అనుమతులున్న సంస్థలతో నియమిత సహకారం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ-వెస్ట్ మేనేజ్‌మెంట్‌పై ప్రజలకు అవగాహన కల్పించిన సిబ్బంది, ఎన్‌సిసి మరియు ఎన్ఎస్ఎస్ విద్యార్థులను ఆయన అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రామమూర్తి, హెచ్ఓడీలు, ఎన్‌సిసి అధికారులు విద్యార్థులు కూడా ఈ కార్యక్రమానికి మద్దతు ఇచ్చారు. ఈ కార్యక్రమం సీతం విద్యార్థులు మరియు సిబ్బందిచే పర్యావరణ సంరక్షణ మరియు బాధ్యతాయుత వ్యర్థ నిర్వహణ కోసం తమ కృషిని కొనసాగించాలనే నూతన ప్రతిజ్ఞతో ముగిసింది. వివరాల కోసం సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు 96767 88811, 9290 215191, 846393 84239, వెబ్‌సైట్: www.sitam.co.

తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోండి

- పార్టీ అందించే ప్రయోజనాలు పొందండి
- పట్టణ పార్టీ అధ్యక్షులు నాగరాజు

విశాలాంధ్ర-చీపురుపల్లి: తెలుగుదేశం పార్టీ పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నత కోసం కృషి చేస్తుందని తెలుగుదేశం పార్టీ చీపురుపల్లి పట్టణ శాఖ అధ్యక్షులు గౌరీ నాగరాజు అన్నారు.. పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం పటంలోని విజయ కాలనీలో నిర్వహించారు. చీపురుపల్లి పట్టణం విజయ కాలనీలో బూత్ నెంబర్ 142,143 పోలింగ్ బూత్‌లో సభ్యత నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం లిచీపురుపల్లి టౌన్ పార్టీ ప్రెసిడెంట్ గవిడి నాగరాజు ఆధ్వర్యంలో ఉదయం నుంచి సుమారు 120 సభ్యత్వాలు చేయించారు. ఈ సందర్భంగా దవిడి నాగరాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు ఐదు లక్షల రూపాయలు ప్రమాద బీమా సౌకర్యం కల్పించబడింది అన్నారు.. అలాగే అర్హులైనటు వంటి ప్రతి మహిళకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఆర్డర్ చేస్తుంది ప్రభుత్వం అన్నారు... ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తెలుగుదేశం ప్రభుత్వము అధికారులు చేపట్టేనా బారు క్షణమే నాలుగు వేల రూపాయలు పెన్షన్ పెంచి ప్రతి ఒక్కరికి అర్హులైన అందరికీ పంపిణీచేసే కార్యక్రమం చేపట్టామని ఆయన అన్నారు.. ఈ కార్యక్రమంలో సనపతి శంకర్రావు,నాగులపల్లి నారాయణరావు, రౌతు కనకరాజు,పిన్నింటి వివేక్ ,కోల రాకేష్, చిలుకూరు శేఖర్, సనపతి శ్రీనివాస్, సనపతి కనకరాజు,పేకాపు సాయి సుధీర్ మరియు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

నగరంలో ముమ్మరంగా ఓటర్ల నమోదు ప్రక్రియ

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : నగరంలో ఓటర్ల ప్రత్యేక నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. పోలింగ్ కేంద్రాలలో ఓటర్ జాబితా పై అభ్యంతరాల స్వీకరణ, కొత్త ఓటర్ల నమోదు, ఫారం 6ను వినియోగించి 18 సంవత్సరాల నుండి వారందరూ ఓటరుగా నమోదు చేసుకుని ప్రక్రియ జరుగుతుంది. ఓటర్ల ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ప్రతి పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ప్రత్యేకంగా పరిశీలించారు. బూత్ లెవెల్ అధికారికి తన సూచనలు జారీ చేశారు. 160, 161, 162, 163, 164,194, 197, 198,233 పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు .ఈ సందర్భంగా కమిషనర్ పి నల్లనయ్య మాట్లాడుతూ కొత్త ఓటర్ల సంఖ్య పెరిగే దిశగా ఓటర్ నమోదు ప్రక్రియ చేపడుతున్నామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అవకాశం కల్పించిన వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నవంబర్ 23, 24 తేదీల్లో కూడా కొత్త ఓటర్ల నమోదుకు దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

నేడు జిల్లా గ్రీవెన్స్ రద్దు

నేడు ఎన్నికల పరిశీలకులు ఎం.ఎం.నాయక్ రాక

విశాలాంధ్ర-విజయనగరం: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమలులో వున్న కారణంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నవంబరు 11వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు జరిగిందని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. జిల్లా ప్రజలంతా యీ విషయాన్ని గమనించాలని కోరారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పరిశీలకులుగా నియమితులైన సీనియర్ ఐ.ఏ.ఎస్.అధికారి ఎం.ఎం.నాయక్ సోమవారం జిల్లాకు రానున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు.

యశస్వినికి పలువురి అభినందనలు

విశాలాంధ్ర-విజయనగరం : రాష్ట్ర తూర్పుకాపు వెల్ఫేర్ అండ్ డవలప్‌మెంట్ కార్పోరేటసన్ చైర్మన్‌గా నియిమతులైన జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వినిని పలువురు నేతలు ఆదివారం విజయవాడలో అభినందించారు. యశస్వినిని అభినందించిన వారిలో జనసేన జిల్లా నాయకులు గురాన అయ్యలు, విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు , కాపుసంఘం నేతలు పివిఆర్ తదితరులు ఉన్నారు.

సెలవు దినాల్లో పనిభారం తగ్గించాలి

ఎపిఎన్‌జిజివో సంఘం డిమాండ్

విశాలాంధ్ర-విజయనగరం: సెలవు దినాల్లో ఉద్యోగులకు సర్వేల పేరుతో పని భారం తగ్గించాలని. ఉద్యోగుల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఎపిఎన్ జిజివో సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం పట్టణంలోని ఎపిఎన్‌జిజివో హాల్‌లో జిల్లా ఎగ్జిక్యూటివ్ సమా వేశం నిర్వహించారు. ఈసమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వి.రమణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జివిఆర్ ఎస్ కిశోర్, ఎ.సురేష్‌లు మాట్లాడుతూ పంచాయతీరాజ్, సచివాలయ ఉద్యోగులను రోజుకొక సర్వేల పేరుతోవారంలో ఉన్న ఒక్క శెలవు లోనూ పనిచేయిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడి 5నెలలైనా నేటికీ పెండింగ్‌లో ఉన్న బకాయిలు ఖాతాలకు చేరలేదన్నారు. అలాగే శాఖాపరమైన ఇబ్బందులను రాష్ట్ర కమిటీ దృష్టికి జిల్లా శాఖ తీసుకువెళ్ళింది. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

2 వేల మందికి అన్న సంతర్పణ

విశాలాంధ్ర-గుర్ల: మండలంలో పాలవలసలో శ్రీ కోదండ రామస్వామి వారి విగ్రహాలకు ఆదివారం మకర తోరణాలు, కిరీటాలను ఆవిష్కరించారు. శ్రీరామ భక్తి పాటలతో భజన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా 2 వేల మందికి అన్న సమారాధన చేపట్టారు. మకర తోరణాలను, విగ్రహాలను పల్లకిలో ప్రతి పూరివీధిలో ఊరేగించారు. భక్తులు భక్తిశ్రద్దలతో పూజా కార్యక్రమంచేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, శ్రీరామ కమిటీ సభ్యులు,పురోహితులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రజస్వల నిహారికను ఆశీర్వదించిన టిడిపి నేతలు

విశాలాంధ్ర-మెరకముడిదాం : మెరకముడిదాం మండలం బాడాం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు శనపతి రామకృష్ణ కుమార్తె నిహారిక రజస్వల కార్యక్రమానికి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదివారం నాడు హాజరు అయ్యి ఆశీర్వదించారు. అనంతరం శనపతి వారు ఇచ్చిన విందును హారగించారు.ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు,మాజీ వైస్ ఎంపిపి టి సుబ్బరాజు, సిరువూరి వెంకటపతిరాజు(నాని) కొండలావేరు పంచాయతీ మాజీ సర్పంచ్ బంగారునాయుడు, స్థానిక టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్ లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: 36వ ఇంటర్ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్-24 లో బాగంగా ఈ నెల 6 నుండి 10వ తేదీ వరకు కాకినాడలో జరిగిన పోటీల్లో విజయనగరం నుండి వెళ్ళిన స్కేటర్లు 5 బంగారు, 7 సిల్వర్, 8 కాంస్య పతకాలతో మొత్తం 20 పతకాలు రాష్ట్రస్థాయిలో సాధించారని అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ .వి.ఎస్ . సీతారామ రాజు (చంటి రాజు) తెలియచేశారు. వీరిలో ఎస్ .రాహుల్ సిద్ధార్థ, ఆర్ బార్గవ్ సాయి,ఎల్ . జే. దేవాన్స్, ఎస్.ప్రదీప్, పి.హాసిని లు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలియజేశారు. పతకాలు సాధించిన స్కేటర్లను, కోచ్ లు బద్రీనారాయణ మురళీకృష్ణ, శ్యామ్ లను అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ .వి.ఎస్ . సీతారామ రాజు,రాష్ట్ర అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎ.ఆర్.వి.ఎస్.ఎస్ మూర్తి, అసోసియేషన్ సభ్యులు శ్రీనివాసరావు, లక్ష్మి, మోహన్ రావులు అభినందించారు.

ఓటు నమోదు కార్యక్రమం విధుల్లో నిర్లక్ష్యం వహించితే కఠిన చర్యలు తప్పవు

తహశీల్దార్ ఎం శ్రీను

విశాలాంధ్ర-బొబ్బిలి : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అంబేద్కర్, రెవెన్యూ డివిజనల్ అధికారి వి ఎస్ ఎస్ రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో ఓటు హక్కు నమోదు, ప్రత్యేక ఓటు నమోదు ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించిన, విధులకు డుమ్మా కొట్టిన సిబ్బంది పైన కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ ఎం శ్రీను హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలో పలు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటుచేసిన ఓటు నమోదు కేంద్రాలను తహశీల్దార్ ఎం శ్రీను ఆకస్మాత్తుగా పరిశీలన చేశారు. బంకురువలస, మెట్టవలస, గొర్ల సీతారాంపురం, పట్టణ పరిధిలో పలు కేంద్రాలను పరిశీలన చేశారు.

హిందూ దేవాలయాల స్వయం ప్రతిపత్తికై పోరాడాలి...



విశాలాంధ్ర-చీపురుపల్లి: హిందూ దేవాలయాల స్వయం ప్రతిపత్తి కొరకు ప్రతి హిందువు పోరాటం చేయాలని ఈ మేరకు 2025 జనవరి ఐదున విజయవాడలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరగనున్న జాతీయ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆదివారం హైందవ శంఖారావం బహిరంగ సభ సన్నాహక సమావేశం చీపురుపల్లి శాఖ తీర్మానించింది. దీనికి సంబంధించిన సన్నాహక సమావేశం చీపురుపల్లి ఖండ స్థానిక ఆర్యసమాజంలో నిర్వహించడం జరిగింది. మన దేవాలయాల సంరక్షణకు ప్రభుత్వ పాలన నుండి దేవాలయాలు హిందువులు నిర్వహించుకునే స్వయం ప్రతిపత్తి కొరకు ప్రతి హిందువు హైందవ శంఖారావసభకు తరలిరావాలని ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ప్రాంత ధర్మ ప్రసార సంయోజిక్ శ్రీ పొగిరి సూర్యనారాయణ పిలుపునిచ్చారు. విజయనగరం విభాగ్ వ్యవస్థా ప్రముఖ్ శివప్రసాద్, జిల్లా కార్యవాహ ఎం రమణ, చీపురుపల్లి ఖండ కార్యవాహ వి సతీష్ కుమార్ జీ సహ కన్వీనర్ కే శ్రీనివాసరావు, ధర్మ ప్రచార కార్యకర్త శంకర్రావు, వివిధ క్షేత్రాల ప్రముఖులు, నియోజకవర్గంలో ధార్మిక, భజన మండలి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగముగా హైందవశంఖారావం బహిరంగ సభ కరపత్రం ఆవిష్క రించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయాలలో దేవాలయ ధర్మాదాయ శాఖలో పనిచేస్తున్న అన్యమత ఉద్యోగులు తొలగించాలి అని డిమాండ్‌చేశారు. అదేవిధంగా దేవాలయాలన్నింట పూజా ప్రసాద కైంకర్య సేవలను అత్యంత భక్తిశ్రద్దలతో నాణ్యతతో నిర్వహించేలా చూడాలి దీని ఉల్లంఘనకు పాల్పడితే దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులలో కూడా హిందువులు మాత్రమే ఉండేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంతేకాక దేవాలయ ట్రస్ట్ బోర్డులలో రాజకీయ పార్టీలతో ప్రమేయం లేని హిందూ దైవ భక్తులు మాత్రమే ఉండాలి అన్నారు. దేవాలయాల నిర్వహణపై ధర్మాచార్యులు తయారుచేసిన నమూనా విధివిధానాలను అమలు చేయాలి అన్నారు. దేవాలయాల పరిసరాలలోని దుకాణాలు అన్నీ హిందువులకు మాత్రమే కేటాయించాలిఅని డిమాండ్ చేశారు. దేవాలయాల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలి అని ఇప్పటికే అన్యాక్రాంతం అయిన ఆస్తులను వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. హిందూ సమాజంపై, హిందూ ఆలయాలపై ఉన్మాదంతో కుట్రపూరితంగా దాడులు చేస్తున్న విదర్మీయులు విద్రోహులను ప్రభుత్వాలు గుర్తించి అత్యంత కఠినంగా శిక్షించాలి అన్నారు. హిందూ దేవాలయాల భూముల్లో అన్యమతస్తుల ద్వారా అక్రమంగా నిర్మింపబడ్డ కట్టడాలన్నీ వెంటనే తొలగించాలి అని డిమాండ్ చేశారు. దేవాలయాల ఆదాయాన్ని కేవలం ధర్మ ప్రచారానికి, మరియు సేవలకు మాత్రమే ఉపయోగించాలి ప్రభుత్వ ప్రజాపాలనా కార్యాలకు వినియోగించరాదు అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు హిందూ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్లుగా దుర్గాప్రసాద్, ఎడ్ల పైడిరాజు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: రాష్ట్ర విభజన అనంతరం చతికిల పడిన కాంగ్రెస్ పార్టీని మళ్లీ గాడిలో పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం కంకణం కట్టుకుంది. ఏపీ లో పార్టీ పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో నడిచేందుకు పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతం చేయనున్నట్లు ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ నియోజకవర్గం కోఆర్డినేటర్లను నియమించినట్లు తెలిపారు. అందులో భాగంగా విజయనగరం నియోజవర్గంకు ఎడ్ల పైడిరాజు, గజపతినగరం నియోజకవర్గం కు చిత్రాడ దుర్గా ప్రసాద్ ను నియమించారు. వీరు క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతం కోసం జిల్లా నాయకత్వంతో కలిసి ముందుకు వెళ్తారని పేర్కొన్నారు.

సంబరంగా అంభలం పూజ

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : చింతలవలసలో ఆదివారం మండల స్థాయి స్వామి లకు అంబలం పూజ కార్యక్రమం నిర్వహించినట్లు గణేష్ గురు స్వామి తెలిపారు. ఈ పూజా కార్యక్రమం చింతలవలస వాస్తవ్యులు సత్యనారాయణ ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు గురుస్వామి తెలిపారు. అంభలం పూజ కార్యక్రమం ముందుగా గణపతి పూజతో ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి స్వామీలు అధిక సంఖ్యలో అంబలం పూజ కార్యక్రమం కు హాజరయ్యారు.

విషాధం నింపిన విహారయాత్ర...

బోల్తా పడిన బాలోరో వాహనం, ఒక యువకుడు మృతి..

విశాలాంధ్ర-శృంగవరపు కోట : విజయనగరం జిల్లా గంట్యాడ మండలం ఎగువకొండపర్తి గ్రామ సమీపంలో వెంకటేశ్వర స్వామి గుడికి బోలేరా వాహనంలో వెళ్లివస్తుండగా మార్గ మధ్యలో బులేరా బోల్తా పడింది. క్షతగాత్రులను శృంగవరపుకోట ప్రభుత్వాసుపత్రికి 108 వాహన సహాయంతో తరలించారు. అందులో 22 మంది ప్రయానిస్తున్నారు వీరులో 14 మందికి తీవ్ర గాయాలు ఒకరు మృతి. మృతుడు సూరెడ్డి కిరణ్ 18 సంవత్సరాలు. గాయపడ్డ వారిలో కొంతమందిని విశాఖ కేజీహెచ్ కు తరలించారు మరి కొంతమందిని విజయనగరం మహారాజ హాస్పిటల్ కి తరలించారు. వీరు అందరూ కొత్తవలస మండల కనిశెట్టిపాలెం గ్రామానికి చెందిన వారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి పట్టణ ప్రధాన కేంద్రంతో పాటు లావేరు,రాజాం, విజయనగరం రోడ్డు లలో ఆదివారం నాడు చీపురుపల్లి ఎస్ ఐ ఎల్ దామోదర్ రావు నేతృత్వంలో పోలీసుల బృందం బొమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా వాహనాలు నడుపుతున్న మైనర్లను పట్టుకుని కౌన్సిలింగ్ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు నిత్యం జరుగుతున్న తరుణంలో తల్లిదండ్రులు కూడా మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు అంటూ ఆయన కౌన్సిలింగ్లో తెలిపారు. అదేవిధంగా హెల్మెట్ టు లేని ప్రయాణాలు నేరమంటూ హెల్మెట్ ధరించరు వారిని పైన కేసులు నమోదు చేశారు. ఆటోల్లో కూడా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వలన ప్రమాదాల సంభవిస్తే అంటూ ఆటో చూడకు కూడా కౌన్సిలింగ్ నిర్వహించి ఆటోలను పరిశీలించారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేపడుతున్న ఈ తనిఖీలలో వాహనాలు నడిపే వారు ప్రతి ఒక్కరు వాహనాలకు సంబంధించిన రికార్డులు సరిగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. తనిఖీలలో భాగంగా అక్రమ రవాణా జరుగుతున్న గంజాయి పైన కూడా నిఘా పెట్టమన్నారు ఈ కార్యక్రమంలో ఎస్సై తో పాటు పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : కార్తీక మాసం పురస్కరించుకుని పంచారామాలను భక్తులు దర్శించుకోవడానికి ఆర్టీసీ విజయనగరం డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్టు డీఎం జె.శ్రీనివాసరావు తెలిపారు.ఈ మేరకు ఆదివారం పంచా రామ పుణ్యక్షేత్రాల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సు సర్వీసులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కార్తీక మాసం సందర్భంగా ప్రతి ఆదివారం పంచారామాలకు బస్సులు వేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఈ ఆదివారం సూపర్ లగ్జరీ, రెండు అల్ట్రా డీలక్స్ బయలు దేరిందన్నారు.అమరావతి భీమవరం , పాలకొల్లు , ద్రాక్షారామం, సామర్లకోట క్షేత్రాలను దర్శించుకునే విధంగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రతీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు బస్సులు బయలుదేరి సోమవారం ఐదు పుణ్య క్షేత్రాలను దర్శింపజేసి, మంగళవారం ఉదయం 6 గంట లకు మళ్లీ విజయనగరం చేరుకుంటామన్నారు. వచ్చే వారం వెళ్లాలనుకునేవారు 9959225620 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఆదినారాయణ, మరియు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్ర లేఖనం పోటీలు

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో తెర్లాం శాఖ గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిస్టం సందర్భముగా విద్యార్థులకు చిత్రలేఖనము పోటీలు నిర్వహించడం కథలు పోటీలు నిర్వహించడం జరిగింది. ప్రతి విద్యార్థి చిత్రలేఖనం ని అలవాటుగా మార్చుకోవాలని స్థానిక గ్రంథాలయం అధికారి సి.హెచ్ కృష్ణమూర్తి అన్నారు. విద్యార్థులకు వారికి నచ్చిన బొమ్మలు వేయాలని, వేసిన బొమ్మలకు రంగులు దిద్దించడం జరిగింది. చదువుతో పాటు చిత్రలేఖనం పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమానికి హైస్కూల్ టీచర్ కే. విస్సు మరియు పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమలులో వున్న కారణంగా విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని కమిషనర్ పి.నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

విశాలాంధ్ర
పేజి : 2
విజయనగరం
సోమవారం 11, నవంబర్ 2024

ముున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ స్థలంలో ఇండ్ల పట్టాలు మంజూరు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

విశాలాంధ్ర-బొబ్బిలి: పారిశుధ్య కార్మికులు నివాసముంటున్న దరిలో కొంత ప్రభుత్వ స్థలం ఉందని గతంలో పారిశుధ్య కార్మికులకు నివాస స్థలాల మంజూరు చేస్తామని పారిశుద్ద కార్మికుల నుండి కొంత మతంలో ప్రభుత్వం కట్టించుకుందని ఆ స్థలములో మున్సిపల్ పారిశుద్ధ కార్మికులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ రెవిన్యూ మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ఇరికు గదుల్లో 2,3 కుటుంబాలు జీవిస్తున్నాయని ఇది అత్యంత బాధాకరమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వమే స్థలం కొనేసి వాళ్లకు ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సింది పోయి ఆ స్థలంలో మురికి నీరు శుద్ధి ప్లాంట్ కడతానండం అన్యాయమని అన్నారు. పోలీసులు సహాయంతో ఆ స్థలంలో ప్లాంట్ కడతామని బెదిరింపులకు దిగడాన్ని సిపిఎం పార్టీ ఖండిస్తున్నదని అన్నారు. కార్మికుల తరఫున సిపిఎం పార్టీ అండగా ఉండి ఆ స్థలాన్ని వాళ్ళ కుటుంబాలు పిల్లలు అవసరాలకు ఇల్లు పంచి మేమే ఇస్తామని అన్నారు. ప్రభుత్వం దౌర్జన్యానికి దిగితే దాన్ని ఎదుర్కొంటామని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. లక్ష్మి, పి. శంకర్రావు మున్సిపల్ యూనియన్ నాయకులు బి. యుగంధర్ జి. వాసు జి. గౌరీ, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

శ్రీ పైడితల్లి అమ్మవారిని దర్శించుకొన్న హీరో వరుణ్ తేజ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ప్రముఖ నటుడు,మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మట్కా ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం విజయనగరం ఆదిత్య థియేటర్ వద్దకు మెగాప్రిన్స్ వరుణ్ తేజ్ చేరుకున్నారు. ముందుగా ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ పైడితల్లి అమ్మవారిని దర్శించుకొన్నారు, ఆలయ అర్చకులు సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి ప్రసాదములు, అమ్మవారి చిత్రపటము అందించారు. తరువాత నేరుగా ఆదిత్య థియేటర్ వద్దకు వెళ్లి భారీ అభిమానుల కొలాహలం మధ్య నటుడు వరుణ్ తేజ్ వెళ్లలేక అభిమానులతోనే భారీ కటౌట్ ను విడుదల చేయించారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు త్యాడ రామకృష్ణారావు(బాలు), చిరంజీవి యువత ప్రతినిధులు, జనసేన యువ నాయకులు పిడుగు సతీష్, కొయ్యాన లక్ష్మణ్ యాదవ్, లోపింటి కళ్యాణ్, చెల్లూరి ముత్యాలనాయుడు, రాజేష్,సాయి,చక్రవర్తి, వరుణ్ తేజ్ అభిమానులు, మెగాఫ్యామిలీ అభిమానులు, జిల్లా రామ్ చరణ్ యువశక్తి అభిమానులు భారీగా పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో 147 మందికి చికిత్స

విశాలాంధ్ర-జామి: మండలంలోని భీమసింగి గ్రామంలో ఆదివారం విజయనగరంకు చెందిన మహేంద్ర గిరి ఆసుపత్రి యాజమాన్యం ఉచిత వైద్య శిబిరంను నిర్వహించింది. ఆసుపత్రి వైద్యులు డా. మహేంద్ర ఆద్వర్యంలో పలువురు వైద్యులు రోగులను పరీక్షించారు. మొత్తం 147మంది రోగులు తమ వ్యాధినిర్దారణకు తగిన పరీక్షలు చేసుకోగా దాదాపు రూ.20వేలు విలువైన మందులను ఉచితంగా అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జొన్నాడ వెంకటలక్ష్మి, ఎంపిటిసి దనియాల హైమావతితోపాటు వైసీపీ నేతలు సత్యంనాయుడు, పి. సంజీవి, మజ్జి హరి, టీడీపీ నేతలు దనియాల పైడిరాజు,రెడ్క్రాస్ శాశ్వత సభ్యుడు బాలమురళీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి యేసు ప్రార్థనా వారోత్సవాలు

విశాలాంధ్ర-విజయనగరం రూరల్: పట్టణంలోని యేసు ప్రేమాలయం ఆధ్వర్యంలో ఈ నెల 11 సోమవారం నుంచి 17వ తేదీ వరకు నిర్వహించే ప్రార్థనా వారోత్సవాలను విజయవంతం చేయాలని పాస్టర్ అలజంకి రవికుమార్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం యేసు ప్రేమాలయం లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ ప్రార్థన వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ దేశ ప్రజల క్షేమం, శాంతి కొరకు ప్రతి ఏడాది నవంబర్ నెలలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సోమవారం నుంచి పట్టణంలోని గురజాడ కళాభారతి ఓపెన్ ఆడిటోరి లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజు వేకువ జామున చేయమన 4 నుంచి 6 గంటల వరకు జరిగే ఈ ప్రార్థన కార్యక్రమాలకు పట్టణంలోని అన్ని ప్రాంతాల నుంచి దైవజనులు హాజరుకావాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కరపత్రాల విడుదల కార్యక్రమంలో సిస్టర్ సువర్ణ, ఎస్.కె.చౌదరి, కోరాడ నాగేశ్వరరావు, విక్టర్ బాబు, సూర్య నారాయణ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల నమోదుకై దరఖాస్తులు స్వీకరణ

హెచ్‌డిటి సత్యనారాయణ

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీలలో ఆదివారం వాటర్ నమోదు కార్యక్రమం హెచ్ డి టి ఉధవోలు, సుందరాడ, కొల్లివలస గ్రామాల్లో జరుగు కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఉద్దవోలు,లో కొత్త ఓటర్ల చేర్పులకు దరఖాస్తులు స్వీకరించారు. అన్ని గ్రామపంచాయతీలో వీఆర్వోలు, బిఎల్వోలుకు పలు సూచనలు చేశారు. ఈ నమోదు కార్యక్రమంలో వీఆర్వోలు వై అప్పారావు, జె. గోపాలకృష్ణ పాల్గొన్నారు.

రాజాంలో గ్రావెల్, మట్టి దొంగలు

అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-రాజాం: రాజాం పట్టణ పరిసర ప్రాంతాలలో చెరువులను తవ్వి గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలు గత కొద్ది రోజులుగా జరుగుతున్నాయి. అక్రమార్కులు చెరువులను తవ్వి మట్టి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. మట్టి మాత్రం యదేచ్ఛగా రవాణా జరుగుతున్నది. అధికారులు అక్రమ మట్టి తవ్వకాలు అరికట్టాలని,అక్రమ మట్టి తవ్వకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వం నిబంధన మేరకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి పరివేక్షించవలసిందిగా తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పదికాలాలు నిలిచేలా
కోర్టు భవనాల నిర్మాణం జరగాలి

- న్యాయవాదులు కమిటీగా ఏర్పడి భవనాల నిర్మాణంపై బాధ్యత తీసుకోవాలి
- బార్ అసోసియేషన్ ఐక్యత, పట్టుదల, సంకల్పం వల్లే నూతన కోర్టు భవనాల మంజూరు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : రాష్ట్రంలోని ఏ జిల్లాలోనూ లేనివిధంగా విజయనగరం జిల్లా కోర్టుకు ఆధునిక వసతులతో కూడిన నూతన భవన సముదాయం మంజూరయ్యాయని, సుదీర్ఘకాలం పాటు నిలిచేలా భవన నిర్మాణం సమయంలోనే న్యాయవాదులు బాధ్యత తీసుకోవాలని పలువురు హైకోర్టు న్యాయమూర్తులు సూచించారు. ముఖ్యంగా యువ న్యాయవాదులే ఈ భవనాల్లో న్యాయవాద వృత్తిలో ప్రాక్టీస్ చేయనున్నందున వారిపైనే భవనాల నిర్మాణం, నిర్వహణ బాధ్యత అధికంగా వుంటుందన్నారు. విజయనగరం బార్ అసోసియేషన్ చూపిన ఐక్యత, పట్టుదల, సంకల్పంతోనే నూతన భవనాల మంజూరు సాకారమయ్యిందని పేర్కొన్నారు. హైకోర్టు న్యాయమూర్తులుగా, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జిలుగా తమ వంతు పాత్రను నిర్వర్తించామని, ఈ భవనాల కోసం ప్రత్యేకంగా ఏవిధమైన ప్రయత్నాలు చేయలేదని పలువురు హైకోర్టు న్యాయమూర్తులు పేర్కొన్నారు. రాష్ట్రానికి న్యాయమూర్తులను అందించడంలో విజయనగరం ముందంజలో వుందన్నారు. విజయనగరం జిల్లా కోర్టు నూతన భవన సముదాయం నిర్మాణానికి రూ.100 కోట్లతో మంజూరు చేసిన నేపథ్యంలో ఈ జిల్లాకు గతంలో అడ్మినిస్ట్రేటివ్ జడ్జిలుగా పనిచేసిన పలువురు న్యాయమూర్తులకు, జిల్లా వాసులైన హైకోర్టు న్యాయమూర్తులకు జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృతజ్ఞత పూర్వక అభినందన సభ ఆదివారం నగరంలోని రింగురోడ్డులో గల ఒక ఫంక్షన్ హాలులో నిర్వహించారు. జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖర్ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయనతోపాటు గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దోనాడి రమేష్, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ నైనాల జయసూర్య, జస్టిస్ కె.మన్మధరావు, జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్, జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ కె.సురేష్‌రెడ్డి తదితరులను శాలువ, మొమెంటోతో విజయనగరం, విశాఖ, పార్వతీపురం జిల్లాల బార్ అసోసియేషన్ల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ మాట్లాడుతూ వదిలివేయబడిన చెరువులో తేలికపాటి మట్టితో కూడిన నేలపై నిర్మించిన కారణంగానే గతంలో 30 ఏళ్ల క్రితం నిర్మించిన కోర్టు భవనాలు దెబ్బతిన్నాయని చెప్పారు. జిల్లా బార్ అసోసియేషన్ ధృడ సంకల్పంవల్లే ఈ ప్రాజెక్టు ఇంత త్వరగా కార్యరూపం దాల్చిందన్నారు. బార్ సభ్యుల కృషికి తన తోటి హైకోర్టు న్యాయమూర్తుల సహకారం లభించడంతోపాటు, జిల్లా వాసిగా సొంత జిల్లాకు న్యాయవ్యవస్థ పరిధిలో ఏదైనా చేయాలనే తన తపన తోడై భవనాల మంజూరు త్వరగా సాకారమైందన్నారు. ప్రస్తుత అవసరాలకు తగినట్టుగా న్యాయవ్యవస్థకు మౌళిక వసతులు కల్పించాలని సుప్రీంకోర్టు ఇప్పటికే నిర్ణయించిందని దెబ్బతిన్న పాత కోర్టు భవనాల స్థానంలో ఆధునిక వసతులతో కొత్తవి మంజూరు చేసేందుకు ప్రాధాన్యమిస్తున్నారని పేర్కొన్నారు. భవనాల నిర్మాణం నిర్ణీత సమయానికి పూర్తి కావాలంటే నిర్మాణ సంస్థతో పాటు బార్ అసోసియేషన్ కూడా బాధ్యత తీసుకోవలసి వుందన్నారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి మాట్లాడుతూ భవన నిర్మాణం నాణ్యతగా జరిగేలా యువ న్యాయవాదులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. భవనం నిర్మించాక తగిన విధంగా నిర్వహిస్తేనే ఇది పదికాలాల పాటు నిలుస్తుందన్నారు. తన తండ్రి, తాతలకు విజయనగరంతో సంబంధ వుందని, తాను యీ మట్టి నుంచి వచ్చినవాడినని పేర్కొన్నారు. చీమలపాటి రవితోపాటు ఆయన తండ్రి, సీనియర్ న్యాయవాది శ్రీరామమూర్తిని కూడా కలసి సత్కరించారు. యువ న్యాయవాదులకు నూతన కోర్టు భవనం ఒక దేవాలయం, విద్యాలయం వంటిదని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య అన్నారు. యువ న్యాయవాదులంతా తమ వృత్తిలో బాగా రాణించాలని ఆకాంక్షించారు. సీనియర్ సభ్యుల విజయగాధలు తెలుసుకొంటూ విజయపథంలోకి వెళ్లాలన్నారు. రాష్ట్రానికి న్యాయాధికారులను అందించడంలో యీ జిల్లా ముందువరసలో వుందని పేర్కొన్నారు. న్యాయవాదులు సమిష్టిగా బాధ్యత తీసుకొని భవనం నిర్వహణపై శ్రద్ధ తీసుకుంటే భవనం జీవితకాలం పెరుగుతుందన్నారు. కొన్ని వందల కోట్ల ఖర్చుతో నిర్మిస్తున్న యీ భవనాన్ని పరిరక్షించుకొనే బాధ్యత న్యాయవాదులపైనే వుంటుందని జస్టిస్ కె.మన్మధరావు చెప్పారు. జిల్లా కోర్టుకు చెందిన సీనియర్ న్యాయవాది, సాహిత్యవేత్త ఎస్.ఎస్.ఎస్.ఎస్.రాజు తాను రచించిన దేవునితో కాసేపు పుస్తకాన్ని చదివానని పేర్కొంటూ అదో గొప్ప పుస్తకంగా అభివర్ణించారు. ఈ పుస్తకంలో పేర్కొన్న అంశాలను ప్రస్తావిస్తూ ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ, మాతృదేవోభవతోపాటు ప్రకృతి దేవోభవ అనేది కూడా చేర్చుకోవాలన్నారు. జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖర్ రావు మాట్లాడుతూ కోర్టు భవనాల నిర్మాణం త్వరగా పూర్తయ్యేందుకు తన వంతుగా కృషిచేస్తానని చెప్పారు. న్యాయమూర్తులను గౌరవించడంలో, న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడటంలో యీ జిల్లా ఎప్పుడూ ముందంజలోనే నిలుస్తోందని జస్టిస్ బి.కృష్ణమోహన్ అన్నారు. మర్యాదలు, మన్ననలు, చక్కటి సంబంధ బాంధవ్యాలు నిర్వహించడంలో యీ జిల్లా వాసుల ప్రత్యేకత అని చెప్పారు. బార్ అసోసియేషన్ లో వున్న ఐక్యత, పట్టుదల, సంకల్పంతోనే కొత్త భవనాల మంజూరు సాధ్యమైందని జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్ అన్నారు. ప్రస్తుతం జిల్లా కోర్టు నిర్వహిస్తున్న భవనాలను కోర్టు అవసరాలకు అనుగుణంగా మార్పులు చేసేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేసేందుకు ముందుకు వచ్చిన ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. వ్యవస్థల పట్ల వారికి గల గౌరవానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. జస్టిస్ కె.సురేష్ రెడ్డి, జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జిల్లా జడ్జి సాయికళ్యాణ్ చక్రవర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.హరీష్, న్యాయవాది కె.వి.ఎన్.తమ్మన్నశెట్టి తదితరులు కూడా మాట్లాడారు. జిల్లా కోర్టు నూతన భవనాల నిర్మాణం త్వరగా పూర్తిచేసేందుకు జిల్లా యంత్రంగం తరపున తమ వంతు సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంంబేద్కర్, జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా విశిష్టతలు, ఇక్కడి ప్రముఖులతో కూడిన స్వల్ప నిడివి గల చిత్రాన్ని ప్రదర్శించారు. జిల్లా కోర్టు భవన నిర్మాణ విశేషాలతో కూడిన మరో చిత్రాన్ని కూడా ఈ సందర్భంగా ప్రదర్శించారు.

జనసేనలోకి ఏఎంసీ మాజీ చైర్మన్లు

ఏఎంసీ మాజీ చైర్మన్ జమ్ము శ్రీను

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ఏఎంసి (మార్కెట్ కమిటీ) మాజీ చైర్మన్, వైసిపి మండల అధ్యక్షుడు జమ్ము శ్రీను, ఆయన కుమార్తె ఏఎంసి మాజీ చైర్‌పర్సన్, వైసిపి మండల మహిళా అధ్యక్షురాలు జమ్ము శశిభార్గవి ఆ పార్టీని వీడి జనసేన పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. తన స్వగృహంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల తన రాజకీయ ప్రస్థానంలో కార్యకర్త స్థాయి నుంచి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేసినప్పటికీ తనకు అండగా నిలిచే ప్రజలకు ఏమాత్రం న్యాయం చేయలేకపోయాననని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు, తన కుమార్తెకు పార్టీలో పదవులు, బాధ్యతలు అప్పగించారే తప్ప పూర్తి స్థాయిలో స్వేచ్ఛను ఇవ్వలేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇన్నేళ్లపాటు రాజకీయంగా తనకు వెన్నంటే నిలిచిన బంధుమిత్రులకు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. పూర్వం నుంచి మెగా కుటుంబం అభిమానిగా పవన్ పార్టీలో చేస్తున్నట్లు చెప్పారు. పవన్ కళ్యాణ్ ప్రతిపక్షంలోను, అధికార పక్షంలోనూ ఉన్నప్పుడు ఒకే విధంగా స్పందిస్తు న్నారని అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఎక్కడ ఏ సమస్య వచ్చినా పవన్ కళ్యాణ్ వెంటనే స్పందించి తన సొంత ఖర్చులతో వారిని ఆదుకుంటున్నారని అన్నారు. తాను ఎప్పుడు రాజకీయాల్లో పూర్తిస్థాయిలో పనిచేస్తానని, అదే పద్ధతిలో జనసేన పార్టీలో కూడా పనిచేస్తానని పేర్కొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పట్టణంలో నవంబరు 7న చైన్ స్నాచింగుకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి తులం బంగారు చైను, చైన్ స్నాచింగుకు వినియోగించిన స్కూటీని సీజ్ చేసినట్లుగా విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. వివరాల్లోకి వెళ్ళితే.. విజయనగరం పట్టణం పాల్ నగర్ కు చెందిన కొవ్వూరి లక్ష్మణ రెడ్డి నవంబరు 7న తన స్వంత పనుల మీద విశాఖపట్నం వెళ్ళి, ఆర్టీసి బస్సులో రాత్రి 10-30 గంటల సమయంలో విజయనగరం వచ్చి, ఆర్టీసీ కాంప్లెక్స్ లో దిగి, పి.వి.ఆర్. ఆసుపత్రి రోడ్డు మీదుగా రైల్వే స్టేషను మోటారు సైకిలు స్టాండులో ఉన్న తన మోటారు సైకిలును తీసుకోవడానికి నడుచుకుంటూ వెళ్ళుచుండగా, ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు స్కూటీ మీద వెనుక నుండి వచ్చి లక్ష్మణ రెడ్డిని క్రింద పడేసి, అతని మెడలోని తులం బంగారు చైను తీసుకొని, స్కూటీ మీద వెళ్ళిపోయినట్లుగా వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వన్ టౌన్ ఎస్ఐ సురేంద్ర నాయుడు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, స్నాచింగుకు పాల్పడిన వ్యక్తులను విజయనగరం పట్టణంకు చెందిన (1) మహంతి వినోద్ కుమార్ అలియాస్ వినోద్ (20 సం.లు) (2) పొట్నూరు డేవిడ్ రాజు అలియాస్ డేవిడ్ (22 సం.లు) కంటోన్మెంట్ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో అరెస్టు చేసి, వారి వద్ద నుండి తులం బంగారు చైను, స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లుగా డిఎస్పీ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. ఈ కేసులో పరారీలో ఉన్న మరో నిందితుడిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని, అతడి గురించి గాలిస్తున్నామన్నారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన వన్ టౌన్ ఇన్చార్జ్ సిఐ ఎల్. అప్పలనాయుడు, ఎస్ఐ సురేంద్ర నాయుడు, హెడ్ కానిస్టేబులు ఎం.అచ్చిరాజు, శ్రీను మరియు ఇతర సిబ్బందిని విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు అభినందించారు.

మంత్రి కొండపల్లి సమక్షంలో చేరికలు

నరవలో వైకాపా నుంచి టిడిపిలో చేరిన 20 కుటుంబాలు

విశాలాంధ్ర-గంట్యాడ : గజపతినగరం నియోజకవర్గంలోని గంట్యాడ మండలం నరవ గ్రామానికి చెందిన ఇరవై కుటుంబాల వారు ఆదివారం రాష్ట్ర యం యస్ యం ఈ, సెర్ప్, యన్ ఆర్ ఐ సాధికారత, సంబంధాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో తెలుగుదేశంలో చేరారు. పార్టీలో చేరిన వారికి మంత్రి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గతం లోను ఇదే గ్రామంలో పెద్దఎత్తున వైసిపి నుంచి తెలుగుదేశం పార్టీలోకి చేరికలు కొనసాగాయి. ఈసందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను మెచ్చి ప్రజలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని అన్నారు. నూతనంగా పార్టీలో చేరిన వారు స్థానికంగా ఉన్న పార్టీ శ్రేణులతో కలిసి ఐక్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గంట్యాడ మండల పార్టీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర నాయుడు, మాజీ సర్పంచ్ సుంకర రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లాలో ఎవరైనా పశువుల అక్రమ రవాణకు పాల్పడితే, చట్టరీత్యా వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరించారు. జిల్లాలో పశువుల అక్రమ రవాణకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఇచ్చిన ఆదేశాలతో గత వారం రోజులుగా పోలీసు అధికారులు, సిబ్బంది జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలను గత వారం రోజులుగా తమ పోలీసు స్టేషను పరిధిలో చేపట్టారు. ప్రధానంగా రాష్ట్రీయ రహదారికి ఆనుకొని వున్న రామభద్రపురం, బొబ్బిలి, బూర్జువలస, పెద మానాపురం పోలీసు స్టేషను పరిధిలో దాడులు, వాహన తనిఖీలు చేపట్టారు. పశువులను అక్రమ రవాణకు పాల్పడుతున్న వారిపై గత వారం రోజుల్లో 11 కేసులు నమోదు చేసి, 12మందిని అరెస్టు చేయడంతోపాటు, 11 వాహనాలను, 189 పశువులను సీజ్ చేసామని జిల్లా ఎస్పీ తెలిపారు. రామభద్రపురం పోలీసు స్టేషనులో ఒక కేసు నమోదు చేసి, ఒకరిని అరెస్టు చేసి, ఒక వాహనం సీజ్ చేసి, 8 పశువులను సీజ్ చేసారన్నారు. అదే విధంగా బొబ్బిలి పోలీసు స్టేషను పరిధిలో ఒక కేసు నమోదు చేసి, ఇద్దరిని అరెస్టు చేసి, ఒక వాహనం, 32 పశువులను సీజ్ చేసారన్నారు. బూర్జువలస పోలీసు స్టేషను పరిధిలో 4 కేసులు నమోదు చేసి, నలుగురిని అరెస్టు చేసి, 4 వాహనాలను, 35 పశువులను సీజ్ చేసారన్నారు. అదే విధంగా పెద మానాపురం పోలీసు స్టేషను పరిధిలో 5 కేసులు నమోదు చేసి, 5గురిని అరెస్టు చేసి, 5 వాహనాలను 114 పశువులను సీజ్ చేసినట్లుగా తెలిపారు. పశువులను అక్రమ రవాణకు ఎవరైనా పాల్పడితే, వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అపూర్వ కలయిక

విశాలాంధ్ర-రాజాం: రాజాం ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ 20వ ఆత్మీయ కలయికను రెండోరోజు ఆదివారం అత్యంత వైభవంగా జరుపుకున్నారు.. ఉదయం యోగా తో ప్రారంభమై, తరువాత ఓల్డ్ ఫండ్స్ అసోసియేషన్ జెండాను ఎగరవేశారు. తొలుత పరిచయ కార్యక్రమాలు జరిగాయి. సమావేశంలో అధ్యక్షులు కొత్త సాయి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ 20 సంవత్సరాలు క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం కలవడం ఎంతో ఆనందంగా ఉందని తెలియజేశారు. గౌరవ అధ్యక్షులు డాక్టర్ పిఎల్ఎన్ రాజు, చిన్ననాటి స్మృతిలోని గుర్తుకు తెచ్చుకోవడం చాలా ఆనందంగా ఉండండి తెలియజేశారు. కార్యదర్శి బివి అచ్యుత కుమార్ మాట్లాడుతూ 20 సంవత్సరాల్లో ఈ సంస్థ తరఫున తను చదువుకున్నటువంటి పాఠశాలకు యూనిఫారం అందించడం, స్కాలర్షిప్ అందించడం, ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కరించుట, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు బహుమతులు అందించుట జరిగిందని తెలియజేశారు తాము చదువుకున్న పాఠశాలకు వెళ్లి తమ పాఠశాలలో శాశ్వత కాంక్రీట్ స్లాబ్ స్టేజిని కట్టాలని నిర్ణయించి సరస్వతి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి హైదరాబాదు నుండి రామలక్ష్మి, మాధవి, పిచ్చుక వెంకట్రావు అస్సాం నుండి ఖాళీ ప్రసాద్ విశాఖపట్నం నుండి అరుంధతి, పద్మ వచ్చారు. ఈ కార్యక్రమంలో గట్టి పాపారావు ,మేగడ మల్లికార్జున, గుప్త, తదితరులు పాల్గొన్నారు.

భక్తులు సౌకర్యార్థం వేసిన సోలార్ లైట్లు : సర్పంచ్ సాయిరాం

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో అరసభలగ గ్రామ సర్పంచ్ కొరగంజి. సాయిరాం గ్రామంలో ఉన్న కార్తీక మాసం భక్తులు, అయ్యప్ప భక్తులకు స్నానాలకు తోటపల్లి కాలువ గట్టు పైన భక్తులకు ఎలాంటి ప్రమాదం జరక్కుండా ఉండేందుకు ముందస్తు చర్యలో భాగంగా గ్రామ యూత్ ఆధ్వర్యంలో సోలార్ లైట్లు వేయించడం జరిగిందని ఆయన తెలిపారు. భక్తులందరూ సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

అందరి కృషి ఫలితంగా నగర అభివృద్ధి సాధ్యం

నగర మేయర్ విజయలక్ష్మి

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: విజయనగరం నగరపాలక సంస్థ కాంట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక సమారాధన, ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. జొన్నాడ దగ్గర ఉన్న ఆర్.కె. ఫామ్ హౌస్ లో ఈ మేరకు సమావేశం నిర్వహించారు. నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కమిషనర్ పి నల్లనయ్య, పూర్వ కమిషనర్ ఎం ఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అందరి కృషి ఫలితంగా నగర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. నగరం అన్ని రంగాలలో అభివృద్ధి చెందడానికి కాంట్రాక్టర్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఇదే ఒరవడితో భవిష్యత్తులో కూడా కాంట్రాక్టర్ల సహాయ సహకారాలు ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బందారు బంగారు రాజు, కార్యదర్శి రాజ్ కుమార్, కోశాధికారి శ్రీనివాసరావు, మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పట్నాల వెంకటేశ్వరరావు, ఈఈ టీ.రాయల్ బాబు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, డిఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పదవి రుద్రవరం సదాశివునికి ఇవ్వడం హర్షణీయం

నాయి బ్రాహ్మణ జిల్లా కోశాధికారి కాపారపు వెంకటరమణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి తిరుపతి నియోజకవర్గానికి చెందిన రుద్రవరం సదాశివునికి ఇవ్వడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కోశాధికారి కాపారపు వెంకటరమణ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తిరుపతి నియోజకవర్గానికి చెందిన రుద్రవరం సదాశివం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నాయి బ్రాహ్మణులతో పాటు అనేకమంది ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించారు అన్నారు. ఆయన చేసిన సేవలను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , కూటమి నాయకులంతా ఆయనకు నాయి బ్రాహ్మణుల కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. రానున్న కాలంలో చైర్మన్ రుద్రవరం సదాశివుని జిల్లాకు తీసుకు వచ్చేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నాయి బ్రాహ్మణులకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

చింతపల్లి బీచ్‌లో పోలీస్ పహారా

విశాలాంధ్ర-పూసపాటిరేగ/విజయనగరం : పూసపాటిరేగ మండలంలోని చింతబీచ్‌లో కార్తీక మాసం సందర్భంగా రద్దీగా ఉన్న నేపథ్యంలో పోలీస్ పహారా ఏర్పాటు చేసారు. ఆదివారం అధికంగా పర్యాటకులు తరలి రావడంతో పూసపాటిరేగ స్టేషన్ ఎస్ఐ దుర్గా ప్రసాద్, మెరైన్ ఎస్ఐ శ్రీనివాసరావు, మహిళా ఎస్ఐల ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పర్యాటకులు సముద్రం లోతుగా వెళ్ళకుండా హెచ్చరికాలు జారీ చేసారు. అలాగే 10మంది స్థానిక ఈతగాళ్ళను అందుబాటులో ఉంచారు. అలాగే పర్యాటకులకు లోతుగా ఉన్న ప్రాంతాలకు వెళ్ళవెద్దని కౌన్సిలింగ్ నిర్వహించారు.

ఉల్లాసంగా తైక్వాండో పోటీలు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: నగరంలోని విజ్జి స్టేడియంలో తైక్వాండో పోటీలను డిఎస్‌డిఓ వెంకటేశ్వర ప్రారంభించారు. ఈ పోటీలకు విశేషమైన స్పందన లభించింది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తైక్వాండ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ టైక్వాండ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డివి చారి ఆధ్వర్యంలో జరిగాయి ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఒంగోలులో ఈనెల 15 16 17 తేదీల్లో 38వ రాష్ట్ర టైక్వాండ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు ఈరోజు జరిగిన పోటీల్లో ఎంపికైన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందన్నారు.